వీడని ముంపు.. తరచూ ముప్పు

- ముంపు బారిన శ్రీరంగపట్నం
- సూరంపాలెం ప్రాజెక్టు అదనపు జలాలతో ప్రమాదం
- పొంగుతున్న బురద కాలువ



శ్రీరంగపట్నంలో జలమయమైన వీధి

మధురపూడి: కళాకారులకు నిలయమైన శ్రీరంగపట్నం గ్రామాన్ని బురద కాలువ ముంపు సమస్య వేధిస్తోంది. అధికంగా వర్షాలు కురిసినా, బురద కాలువలోకి అదనపు జలాలు చేరినా ఈ గ్రామం ముంపు బారిన పడుతుంది. ప్రస్తుతం గంగవరం మండలం సూరంపాలెంలోని ప్రాజెక్టు నుంచి అదనపు జలాలను విడుదల చేయడంతో శ్రీరంగపట్నం ముంపునకు గురైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మేజర్ పంచాయతీ

కోరుకొండ మండలంలోని మేజర్ పంచాయతీలలో శ్రీరంగపట్నం ఒకటి. ఈ గ్రామానికి రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. మండల ప్రజా పరిషత్‌లో ఈ గ్రామానికి చెందిన నాయకులు కీలక పదవులు నిర్వహించారు. ఈ గ్రామంలో సుమారు 10, 500 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామాన్ని ఆనుకుని బురద కాలువ ప్రవహిస్తుంది. కాలువ పొంగితే గ్రామంలోని బీసీ, ఎస్సీపేటలు ముంపు బారిన పడతాయి. ప్రధాన కాలువ నుంచి కాపవరంలో చెరువుకు నీరు సరఫరా అయ్యే కాలువకు ఆనుకొని బీసీ, ఎస్సీపేటలు ఉన్నాయి.

నెల్లిపూడి వాగు

బురద కాలువకు తోడు గంగవరం మండలం నెల్లిపూడి వాగు ఉధృతంగా ప్రవహించినా శ్రీరంగపట్నానికి ముంపు ముప్పు తప్పదు. కొండల పైనుంచి వచ్చే నీటితో నెల్లిపూడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆకస్మాత్తుగా వరదనీటితో పోటెత్తుతుంది. దీని ప్రభావంతో శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లోని పొలాలు నీటమునుగుతాయి. ఇది గోకవరం మండలం కామరాజుపేట వద్ద బురద కాలువలో కలుస్తోంది. అక్కడి నుంచి దీన్ని పెద్ద కాలువ అని కూడా పిలుస్తారు. గోకవరం మండలంలోని గోకవరం, అచ్యుతాపురం మీదుగా శ్రీరంగపటాన్నికి చేరుతోంది. అక్కడి నుంచి మునగాలలోని తొర్రిగెడ్డ కాలువ ద్వారా గోదావరిలో కలుస్తుంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ



శ్రీరంగపట్నం రోడ్లపైకి చేరిన బురద కాలువ నీరు

అదనపు జలాలతో..

వర్షాల కారణంగా అటవీ ప్రాంతం నుంచి వాగుల ద్వారా వచ్చిన నీరు అధికంగా సూరంపాలెం జలాశయంలోకి చేరుతోంది. జలాశయం నిండిపోతే అదనపు జలాలను కిందకు విడుదల చేస్తారు. సాధారణంగా 900 నుంచి 1,500 క్యూసెక్కుల వరకూ విడుదలైనా ఇబ్బంది ఉండదు. కానీ ఇప్పుడు దాదాపు 2 వేల క్యూసెక్కులు విడుదల చేయడంతో బురద కాలువకు నీటి ఉధృతి పెరిగి శ్రీరంగపట్నం ముంపునకు గురైంది. దాదాపు 5 వేల ఎకరాల్లో పంటపొలాలు, 20 వీధులు మునిగాయి. ఎస్సీ, బీసీ పేటల్లోని 600 ఇళ్ల మధ్యకు వరద నీరు చేరింది.

ప్రమాదకరం



బురద కాలువ మామూలు సమయంలో రైతులకు వ్యవసాయానికి సాయపడుతుంది. నీటి ఉధృతి పెరిగినప్పుడే ప్రమాదకరంగా మారుతుంది. సూరంపాలెం జలాశయం నిండిపోతే మాత్రం ముంపు సమస్యను సృష్టిస్తుంది. కాలువ నీటితో వాణిజ్య పంటలతో పాటు ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి పంటను కూడా సాగు చేస్తారు.

– అత్తిలి రాంప్రసాద్, శ్రీరంగపట్నం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు

ప్రతిపాదనలు



శ్రీరంగపట్నం గ్రామానికి బురద కాలువ ముంపు సమస్యను శాశ్వత పరిష్కార చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రతిపాదనలు పంపారు. రూ.35 కోట్ల అంచనాతో వీటిని రూపొందించడం జరిగింది. కాలువకు ఇరువైపులా శ్రీరంగపట్నంలో రక్షణ గోడ నిర్మిస్తాం.

– శివ ప్రసాద్, జేఈ, సాగునీటి శాఖ

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ

బురద కాలువకు ఇరువైపులా 10 మీటర్లు ఎత్తున రక్షణ గోడ నిర్మించడం ద్వారా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.14 కోట్ల గ్రాంట్లు సాధించారు. దానికి సంబంధించిన పనులు వేసవిలో ప్రారంభమవుతాయి. రక్షణ గోడ నిర్మాణం చేపట్టి మంపు సమస్యకు చరమ గీతం పాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముంపు కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త డిజైన్లతో చేనేత ఉత్పత్తులకు ఆదరణ

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



పులుగుర్తలో జరిగిన చేనేత దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పెదపూడి: మార్కెట్లోని వినియోగదారులను ఆకర్షించేలా కొత్త డిజైన్లతో, విభిన్న రంగులతో తయారు చేస్తే చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తుందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అనపర్తి మండలం పులుగుర్తలోని చేనేత పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ చేనేత తయారీలో కాలానుగుణంగా కొత్త డిజైన్లు రూపొందించి అభివృద్ధి చెందాలని చేనేత కార్మికులకు సూచించారు. నేషనల్ హ్యాండ్లూమ్ కార్పొరేషన్, నేషనల్ హ్యాండ్లూమ్ ఆఫ్ డిజైనర్ ద్వారా కొత్త డిజైన్లు నేర్చుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్ఎంఎస్ఎస్, ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేనేత సొసైటీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పది మంది చేనేత కార్మికులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, చేనేత జౌళి అధికారులు శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.ధనుంజయరావు, చేనేత సేవ కేంద్రం ప్రతినిధి అలోక్ రంజన్, డెవలప్‌మెంట్ అధికారి జి.కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ అంతరాయం

మధురపూడి: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో కోరుకొండ, బూరుగుపూడి సబ్ స్టేషన్ల పరిధిలోని కోటికేశవరం, బుచ్చెంపేట ఫీడర్లకు సంబంధించి శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రాఘవపురం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, బుచ్చెంపేట, జగన్నాథపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ బలభద్రపురం, కానేడు, కాపవరం గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

రాజానగరం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో దివాన్ చెరువులోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ దివాన్ చెరువు, పాలచర్ల, శ్రీరామపురాలలో విద్యుత్ ఉండదన్నారు.

రీజినల్ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్



రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రంగంపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల రీజినల్ సెక్రటరీగా గుమ్మడి రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యుత్తు శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గంలో రాజేంద్రప్రసాద్‌ను ఈ పదవికి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం మండల ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాజేంద్రప్రసాద్‌ను పలువురు ఉద్యోగులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్జెక్టులపై పట్టు సాధిస్తే మంచి మార్కులు



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం: సబ్జెక్టులపై పట్టును సాధించడం ద్వారా పరీక్షలలో అత్యుత్తమ మార్కులు పొందవచ్చని, తద్వారా ప్రముఖ కంపెనీలలో సమున్నత ఉద్యోగావకాశాలను అందుకోవచ్చని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను అందుకోవడంతో పాటు తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని, క్రమశిక్షణతో ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు.

ముర్రుపాలు టీకాలా పనిచేస్తాయి



శహపురంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న పద్మావతి

పెదపూడి: తల్లి ముర్రుపాలు **పుట్టిన గంట**లోపు బిడ్డకు పట్టిస్తే అవి **టీకాలా పనిచే**స్తాయని కాకినాడ అర్బన్ **ఐసీడీఎస్ ప్రాజెక్ట్** సంపర సెక్టార్ సూపర్**వైజర్ సీహెచ్** పద్మావతి అన్నారు. శహపు**రం, పుట్టకొండ** గ్రామం శివారు గరువు **అంగన్‌వాడీ కేం**ద్రాల్లో ప్రపంచ తల్లిపాల **వారోత్సవాలు,** సామూహిక సీమంతాలు **బుధవారం** నిర్వహించారు. ఈ సంద**ర్భంగా ఆమె** మాట్లాడుతూ తల్లి ముర్రు**పాలు బిడ్డకు** కామెర్లు రాకుండా నిరోధిస్తూ **వ్యాధి నిరోధక** శక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వనుం శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలి

పెదపూడి: తల్లి పాలు అమృతంతో సమానమని, తల్లులు బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు ఇవ్వాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణతో ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రధానాధికారి డాక్టర్ నాయుడు

రాజానగరం: శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సహకారంతో 'నర్సరీ యాజమాన్యం, ఉద్యాన పంటలలో అంటుకట్టు విధానాలు' అనే అంశంపై గ్రామీణ యువతకు వారం రోజులు నిర్వహించే శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ గ్రామీణ యువతకు, రైతు మహిళలకు వ్యవసాయం, అనుబంధ రంగాలలో వినూత్న సాంకేతికను అందించడానికి కేవీకే కృషి చేస్తుందన్నారు. ఆత్మ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆర్థిక భాగస్వామ్యంతో ఇస్తున్న ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. కేవీకే ఉద్యాన విభాగం అధికారి జేవీఆర్ సత్యవాణి మాట్లాడుతూ నర్సరీల నిర్వహణ, ఉద్యాన పంటల యాజమాన్యాల ఆవశ్యకత, రానున్న వారం రోజులలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలిపారు. శిక్షణకు గ్రామీణ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కడియం మండలం నుంచి ఆరుగురు, గొల్లప్రోలులోని శాంతివర్ధన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఐదుగురు, రాజానగరం, జగ్గంపేట మండలాల నుంచి మరికొందరు యువత హాజరయ్యారు.

ముత్యాల పోసికుమార్‌కు సత్కారం



పోసికుమార్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్ నాయుడు

ధవళేశ్వరం: శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఏపీ కాపు జేఏసీ జిల్లా చైర్మన్ ముత్యాల పోసికుమార్‌ను ఘనంగా సత్కరించారు. కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కాపుల ఐక్యత కోసం, కాపుల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని పోసి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాపు జేఏసీ నాయకులు జేటి రామారావు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌పై అధికారుల కొరడా

అనుమతి లేని కట్టడాలు, రోడ్ల తొలగింపు



అక్రమ లేఅవుట్‌లో కూల్చివేసిన ప్రహరీ



వడిశలేరు అక్రమ లేఅవుట్‌లో అధికారులు ధ్వంసం చేసిన రోడ్డు

రంగంపేట: మండలంలోని వడిశలేరులో వేసిన అక్రమ లేఅవుట్‌పై అధికారులు కొరడా ఝులిపించారు. వడిశలేరు పంచాయతీ కార్యదర్శి సుబ్బారాయుడు తెలిపిన వివరాల ప్రకారం వడిశలేరు గ్రామ పంచాయతీ పరిధిలో 2021–22లో 365/3, 367, 368, 368/ఎ, 368/బీ, 368/సీ, 368/డీ, 369, 370, 371, 372, 372/2, 373/2, 374/2, 375/1 సర్వే నంబర్లలో 15.54 సెంట్ల భూమిలో గరికపాటి డెవలపర్స్ పేరిట లేఅవుట్ ఏర్పాటు చేశారు. దానికి ఎలాంటి అనుమతులు లేవని తెలియడంతో పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీ చేశారు. అనంతరం మరో మూడు నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో సదరు లేవుట్‌లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను, ప్రహరీలను కూల్చివేయడంతో పాటు రోడ్లను ప్రొక్లెయిన్‌తో ధ్వంసం చేశారు. అనంతరం సదరు లేఅవుట్‌ను అక్రమ లేఅవుట్‌గా నిర్ధారిస్తూ సూచిక బోర్డులు పెట్టారు.

ఇన్‌చార్జి ఎస్సైగా ఆనంద్ కుమార్

సీతానగరం: కోరుకొండ ఎస్సై ఆనంద్ కుమార్ బుధవారం సీతానగరం ఇన్‌చార్జి ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ పనిచేసిన టి.రామకృష్ణ తాళ్లపూడికి బదిలీ అయ్యారు. కొత్త ఎస్సై నియామకం జరిగే వరకూ ఇన్‌చార్జిగా ఆనంద్ కుమార్ వ్యవహరిస్తారు.

సెంట్రల్ జోన్ డీఎస్పీగా రమేష్‌బాబు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీగా కె.రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 1989 బ్యాచ్‌కు చెందిన రమేష్‌బాబు మచిలీపట్నం జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో విధులు నిర్వహించారు.

పోస్టల్ పథకాలతో ఎంతో ప్రయోజనం



సదస్సులో మాట్లాడుతున్న పోస్టల్ అధికారి రాజేష్

సీతానగరం: పోస్టల్ శాఖలో దాదాపు 25 రకాల పథకాలు ఉన్నాయని, వీటి ద్వారా ఖాతాదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ ఎన్ సీహెచ్‌వి రాజేష్ తెలిపారు. డాక్ చౌపల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సీతానగరం సచివాలయం –1 ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీతానగరం సబ్ పోస్ట్‌మాస్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతూ పోస్టల్ శాఖలోని పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బీమా, పొదుపు పథకాలు, ఆధార్ పేమెంట్స్, గ్రూప్ బీమా తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ పథకాల వివరాల కోసం స్థానిక సచివాలయంలో పోస్ట్‌మన్ నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: గోతులమయంగా తయారైన రాజానగరం – కాకినాడ ఏడీబీ రోడ్డుకు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి, తాత్కాలిక మరమ్మతులు చేయించామని రాజమహేంద్రవరం ఆర్‌డీసీ సబ్‌డివిజన్ ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ కేవీకే రెడ్డి తెలిపారు. 'వర్షాలకు ఛిద్రమవుతున్న రోడ్లు' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. సామర్లకోట నుంచి రాజానగరం వరకు రోడ్డు విస్తరణ, పటిష్ట పరచే పనులను రూ.293 కోట్లతో చేపట్టామన్నారు. 30 కిలోమీటర్లకుగాను 21 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. ఇందుకుగాను కాంట్రాక్టరుకు రూ. 48.25 కోట్ల వరకు బిల్లులు బకాయిలున్నాయన్నారు. వీటిని చెల్లించకపోవడం వలన నిబంధనల మేరకు పనులను తాత్కాలికంగా ఆపివేశారన్నారు. అతడికి బకాయిలు చెల్లించిన వెంటనే పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం కూడా జరిగిందని చెప్పారు. ఈలోగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించి, తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. వీటికి ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు రాలేదని, కాంట్రాక్టర్‌తో చేయిస్తున్నామని వివరణ ఇచ్చారు.

దస్తావేజు పోయినది

వల్లభశెట్టి శివపద్మిని, భర్త రామసతీష్, దుప్పలపూడి, అనపర్తి మండలం నాకు దుప్పలపూడి గ్రామంలో నా పేరు మీద గల (1) క్రయ దస్తావేజు నెంబర్ 3162/2023 అనపర్తి సబ్ రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడినవి. నేను నా ఇంటి వద్ద నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళు మార్గమధ్యలో పడిపోయినవి. ఎవరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు

వల్లభశెట్టి శివపద్మిని, రామసతీష్ దుప్పలపూడి, అనపర్తి మండలం



గట్టుపై కర్మకాండలను నిర్వహిస్తున్న పురోహితులు



ఘాట్‌పైకి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం



కోటిలింగేశ్వరస్వామి ఆలయం వెలుపల చెత్త డంపింగ్

ఓ మై ఘాట్..

- అధ్వానంగా కోటిలింగాల రేవు
- పేరుకుపోయిన బురద, చెత్త
- పట్టించుకోని అధికారులు
- పుణ్యస్నానాలకు భక్తుల అవస్థలు

సీటీఆర్ఐ: నగరంలోని ప్రముఖమైన కోటిలింగాల ఘాట్ అధ్వానంగా మారింది. ఇటీవల గోదావరికి వరద రావడంతో మెట్లను తాకుతూ నీరు ప్రవహించింది. వరద ఉధృతి తగ్గిన తర్వాత నీరు పూర్తిగా లాగేసింది. కానీ కోటిలింగాలఘాట్ మెట్లపై భారీగా బురద, చెత్త పేరుకుపోయింది. దాన్ని శుభ్రం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్నానాలు చేయడానికి కూడా వీలు లేకుండా మారింది. అలాగే పితృకర్మలు, పిండ ప్రదానాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో నగరపాలక సంస్థ నిర్లక్ష్యానికి భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

గోదావరిలో పుణ్యస్నానాలు

చారిత్రక నగరం రాజమహేంద్రవరం అంటే అందరికీ గుర్తుకువచ్చేది గోదావరి. ఎక్కడెక్కడినుంచో ప్రజలు ఇక్కడి గోదావరిలో పుణ్యస్నానాలు చేయడానికి వస్తారు. వ్యాపార, వాణిజ్య కేంద్రమైన నగరానికి వచ్చిన వారందరూ గోదావరిని చూడకుండా వెళ్లరు. ఈ నేపథ్యంలో గోదావరి తీరంలో నగరంలో పలుచోట్ల ఘాట్లు నిర్మించి, వాటిని సుందరంగా అభివృద్ధి చేశారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు స్థానికులు కూడా సాయంత్రం వేళలో ఈ ఘాట్లను సందర్శిస్తారు. గోదావరి అందాన్ని చూస్తూ సేదతీరతారు.

భక్తుల తాకిడి

శ్రావణ మాసం సందర్భంగా గోదావరి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించడానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కోటిలింగాలఘాట్‌కూ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే ఘాట్‌లో బురద పేరుకుపోవడం సమస్యగా మారింది. ఇక్కడ కర్మకాండలు నిర్వహించడానికి దేశం నలుమూలల నుంచి ప్రజలు వస్తారు. అంతేకాకుండా ఇక్కడి కోటిలింగేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది.



కోటిలింగాల ఘాట్‌లో పేరుకుపోయిన బురద

ఎక్కడి చెత్త అక్కడే

దేవాలయాల ప్రాంతాలలో చెత్త వేయకూడదు, ఒక వేళ చెత్త ఉన్నా వెంటనే తొలగించాలి. కానీ పవిత్రమైన కోటిలింగేశ్వరస్వామి ఆలయం వెలుపల నెల రోజులుగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులు చెత్త నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు కళ్లు తెరవడం లేదు.